సాక్షి నిర్మల్

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



కర్ర గణేశ్‌ను కొలుద్దాం

మహారాష్ట్రలోని భోకర్ తాలూకాలోగల పాలజ్ గ్రామంలో కర్ర గణపతిని పూజిస్తారు. పక్కనే ఉన్న తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లోనూ కర్ర గణేశుడిని పూజించడం ఆనవాయితీ. 8లో ▶



వైభవంగా విశ్వకర్మ జయంతి

జిల్లా వ్యాప్తంగా విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. 9లో ▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 / 24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గోమయ వినాయక ప్రతిమల పంపిణీ



గోమయ గణేశ్ ప్రతిమను పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో క్లిమామ్ సంస్థ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి తయారు చేయించిన గోమయ వినాయక ప్రతిమలను ఆదివారం మంత్రి ఐకేరెడ్డి పంపిణీ చేశారు. నిర్మల్ నియోజకవర్గంలో ఏటా క్లిమామ్ సంస్థ, ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా గోమయ గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అల్లోల గౌతంరెడ్డి, సేవ్ దేశీ కౌస్ క్యాంపెయినర్, క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గోమయ గణపతి అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఐకేఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ అల్లోల గౌతమ్‌రెడ్డి, క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డి దంపతులకు గోమయ గణపతి ప్రతిమను ఆదివారం అందజేశారు. గోమయ గణపతి తయారీ ప్రక్రియను వివరించారు.

‘బీఆర్ఎస్ ఓటమే లక్ష్యం’



సమావేశంలో మాట్లాడుతున్న తిలక్‌రావు

ఖానాపూర్: బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతిభవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు, నిర్వహిస్తున్న సభలు, ఇస్తున్న హామీలు ఎన్నికల కోసమే గాని ప్రజలపై ప్రేమతో కాదని ఆరోపించారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందుతున్న దాఖలాలు లేవన్నారు. పూర్తి స్థాయిలో పంటరుణాలు మాఫీ చేయకుండా రైతులను వంచిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగినరీతిలో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు వినయ్, భీంరావు, శ్రీను, రాజేందర్, వసంత్‌రావు ఉన్నారు.


బీఆర్ఎస్‌లో చేరికలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో మామడ మండలం పరిమండల్, జగదాంబతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంత్రి కండువాలు వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం కొట్ల (కే), ఎల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వీరికి మహేశ్వర్‌రెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. నాయకులు మేడిసెమ్మ రాజు, అయ్యన్నగారి రాజేందర్, అనిల్, జమాల్, హరీశ్‌రెడ్డి తదితరులున్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి



సమావేశమైన నాయకులు, కులస్తులు

ఖానాపూర్: గౌడ కులస్తులు హక్కుల సాధనకు పోరాడాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏ నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శివాజీనగర్‌లోని గౌడ సంఘ భవనంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్తులకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించేదాకా పోరాడాలని సూచించారు. ఈ నెల 21న మస్కాపూర్ గ్రామంలోని సీఎంరావు గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సంఘం జిల్లా మహాసభలకు జిల్లాలోని గౌడ కులస్తులంతా తరలిరావాలని కోరారు. నాయకులు ఒల్లాల నర్సాగౌడ్, బుర్ర రాజారామ్, మల్లాగౌడ్, ప్రకాశ్‌గౌడ్, వెంకాగౌడ్, రాజేందర్‌గౌడ్, రాముగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, భూమాగౌడ్ తదితరులున్నారు.

ఎకోదంతుడికి జై..



మట్టితో గణపయ్యలను తయారు చేస్తున్న చిన్నారులు

- జిల్లా అంతటా మట్టిగణపయ్య
- ప్రత్యేకం.. ‘గోమయ’ రూపం
- బీజగణపతికి ఈసారి శ్రీకారం
- పర్యావరణ హితమే సందేశం
- నేటి నుంచి నవరాత్రోత్సవాలు

నిర్మల్: ప్రకృతి ప్రియుడైన ఏకదంతుడు ఏడాదికేడాది మారుతూ వస్తున్నాడు. కొన్నేళ్లుగా ‘ఎకో’దంతుడిగా ఇంట్లో అడుగుపెడుతున్నాడు. ఈసారి మరింత పర్యావరణ హితుడిగా పార్వతీ తనయుడు విచ్చేశాడు. ఇళ్లతో పాటు గల్లీ గణేశులూ మట్టి, గోమయం తదితర ఎకో ఫ్రెండ్లీ రూపాలతో కొలువుదీరుతున్నాడు. రాష్ట్రంలోనే తొలిసారి జిల్లాలో బీజగణపతి ప్రాణం పోసుకున్నాడు. ఎక్కడా లేని విధంగా మన ప్రాంతంలో కొలువుదీరే కర్ర గణపయ్య యథావిధిగా ఆశీస్సులు అందించనున్నాడు. వీలైనంతవరకు జిల్లావాసులు పర్యావరణ పరిరక్షణకు తమవంతు.. అంటూ మట్టి గణపతికే జై కొడుతున్నారు. నవరాత్రుల కోసం జిల్లా ముస్తాబైంది.

మట్టి నుంచి పుట్టి..

మట్టితో ప్రాణం పోసుకుని, పచ్చనిఆకులతో అలంకరించుకోవడమంటేనే గణపయ్యకు ఇష్టం. అందుకే పండుగరోజు పొద్దున్నే మార్కెట్‌కు వెళ్లి మట్టి గణపతి విగ్రహాన్ని తీసుకుంటారు. గణపతికి ఇష్టమైన.. పలురకాల చెట్ల దళాలు, ఆకులు, కాయలు, మొక్కజొన్న కంకులు, దోసకాయలు కొంటారు. వినాయక చవితి ఉత్సవమే పచ్చదనంతో ప్రకృతి పురివిప్పిన సమయంలో వస్తుంది. ఎటుచూసినా గ్రీనరీ ఉంటుంది. ఇలాంటి వాతావరణాన్ని, ఆ ప్రకృతిలో లభించే పచ్చదనాన్ని పార్వతీపుత్రుడు ఇష్టపడతాడు. ఇంట్లో కొలువుదీరే గణపతయినా, పూజల్లో ఉపయోగించేది ఏదైనా.. ప్రతీదీ పర్యావరణానికి మేలు చేసేలా ఉండటం ఈ పండుగ విశేషం.

బీజగణపతికి శ్రీకారం

ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించే జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మి ఈసారి వినాయకచవితికి కొత్తదనాన్ని తీసుకువచ్చారు. పండుగలో నవరాత్రులు కొలువుదీరడంతో పాటు నిమజ్జనం తర్వాత పచ్చని చెట్టుగా ఎదిగే బీజగణపతిని తయారు చేయించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మట్టితో వీటికి ప్రాణం పోయించారు. కలెక్టరేట్‌లో శనివారం రాష్ట్ర పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయించారు.



బీజగణపతితో డీఆర్డీవో, మహిళా సంఘాల సభ్యులు

తయారీ ఎలా అంటే..

చెరువుమట్టితో రావి, మర్రి, మేడి, గంధం విత్తనాలను వేసి విగ్రహాలను తయారు చేశారు. ఇలా చేసిన విగ్రహాలను పొలాలు, గట్ల దగ్గర, చెరువు గట్ల వద్ద.. ఎక్కడ నిమజ్జనం చేసినా వాటిలోని విత్తనాలు మొలకెత్తుతాయి. ప్రకృతికి మేలుచేసేలా మట్టి గణపతిని పూజించడంతో పాటు నిమజ్జనం తర్వాత కనీసం ఓ మొక్క మొలిచేందుకు దోహదపడేలా వీటిని రూపొందించారు. మొత్తం 3వేల విగ్రహాలు తయారు చేయించి, రూ.100కు ఒకటి చొప్పున విక్రయించారు. ఇలా వచ్చిన మొత్తాన్ని కూడా మహిళా సంఘాలు, వీవోఏలకు అందించనున్నారు.

చిట్టిచేతుల్లో మట్టిగణపయ్య

ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో పర్యావరణ హితుడైన మట్టి గణపయ్య విగ్రహాలను తయారు చేయించారు. కొన్ని బడుల్లో వీటిపై పోటీలు పెట్టిమరీ ప్రోత్సహించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో చేసే విగ్రహాలతో ప్రకృతికి ఎలా నష్టం జరుగుతుందో పిల్లలకు అవగాహన కల్పించారు. చిట్టిచిట్టి చేతులతో చిన్నారులు అందంగా వినాయక ప్రతిమలు తయారు చేసి తమ ఇళ్లకు తీసుకెళ్లారు. పండుగ రోజు తమ చేత్తో చేసిన గణపయ్యకు పూజలు చేస్తామని చెప్పారు.

గోమయ గణపయ్య..



గోమయ గణపతితో దివ్యారెడ్డి, గౌతమ్‌రెడ్డి

ఎప్పుడో పురాణాల్లో మన దేశంలో గోమయ గణపయ్యను పూజించినట్లు తెలుసుకున్న అల్లోల దివ్యారెడ్డి మళ్లీ ఆనాటి గణపతికి ప్రాణంపోశారు. ఒకప్పటి గోమయ వినాయకుడికి రూపునిచ్చారు. ఇప్పుడు దేశంలోనే ఎక్కడా లేనివిధంగా నిర్మల్‌లో దాదాపు 400కు పైగా గోమయ గణపతి విగ్రహాలు కొలువుదీరాయి. ఎవరీ దివ్యారెడ్డి.. అసలేంటీ గోమయ గణపతి అంటే.. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుమారుడైన గౌతమ్‌రెడ్డి భార్య దివ్యారెడ్డి. ఈమె ‘క్లిమామ్’ పేరిట పూర్తి దేశీ ఆవులతో కూడిన గోశాలను నిర్వహిస్తున్నారు. అందులోని దేశీఆవుల పేడ (గోమయం)తో 2016లో గణపతులను తయారు చేయడం ప్రారంభించారు. అలా రూపుదిద్దుకున్న వాటినే గోమయ గణపయ్య అని పిలుస్తున్నట్లు దివ్యారెడ్డి చెబుతున్నారు.

నర్సాపూర్(జీ)లో పేపర్ గణపతి



గణపతి విగ్రహ తయారీలో వంశీకృష్ణ

నర్సాపూర్(జీ): మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్–అనసూయ దంపతుల కుమారుడు వంశీకృష్ణ 14 ఏళ్లుగా మండల కేంద్రంలో ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతిని తయారు చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వృత్తి రీత్యా వంశీకృష్ణ హైదరాబాద్‌లో గ్యాప్ యూఎస్ కంపెనీలో త్రీడీ ఆర్టిస్ట్‌గా వర్క్ ఫ్రమ్ హోం విధానంలో పని చేస్తున్నాడు. ప్రతీ సంవత్సరం పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని పేపర్ గణపతిని తయారు చేస్తున్నాడు. ఇలా తయారు చేసిన ప్రతిమను స్థానిక పెద్ద హనుమాన్ ఆలయంలో నెలకొల్పుతున్నట్లు అతడు పేర్కొన్నాడు. ప్రతిమ తయారీకి తన స్నేహితులు బన్ను, మహేశ్, సాయి, అరవింద్, రాజు కూడా సాయమందించారని తెలిపాడు. ఈ సంవత్సరం విగ్రహ తయారీకి అయిన ఖర్చును మండల కేంద్రానికి చెందిన ఆడెపు నవీన్ భరించినట్లు వివరించాడు.

సంక్షేమ పథకాల అమలులో అగ్రగామి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై కలెక్టర్, ఎస్పీ

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా సమైక్యతా దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు మంత్రి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ప్రజలకు సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రంగాల్లో ముందుందని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17న రాచరిక పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిందని పేర్కొన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభిస్తే తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

నిజాంను తలపిస్తున్న కేసీఆర్

- బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఘనంగా విమోచన దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ పాలన నిజాం పాలనను తలపిస్తోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి వెయ్యి ఉరుల మర్రి వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన అంతమై దేశమంతటా స్వాతంత్ర్య సంబురాలు జరుపుకొంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఆ అదృష్టం లేకుండా పోయిందని గుర్తు చేశారు. నాటి హోంమంత్రి సర్దార్ వల్లభ బాయ్ పటేల్ చొరవతో 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగుబాటు ప్రకటనతో హైదరాబాద్ వాసులకు అసలైన స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినా ప్రజల బతుకులు మారలేదని, సీఎం కేసీఆర్ పోలీసులను అడ్డుపెట్టుకొని దొరల పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని అప్పటి ప్రభుత్వాలను డిమాండ్ చేసిన కేసీఆర్ ఇప్పుడు అధికారంలో ఉండి ఎందుకు నిర్వహించడంలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్న కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగినరీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.



జెండాకు నమస్కరిస్తున్న ఏలేటి, నాయకులు

‘కాంగ్రెస్‌వి పగటి కలలు’

నిర్మల్‌టౌన్: తెలంగాణలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఎన్ని సీడబ్ల్యూసీ సమావేశాలు పెట్టినా, ఎన్ని బహిరంగసభలు నిర్వహించినా ప్రజలు నమ్మరని తెలిపారు. సోనియాగాంధీని ఒకప్పుడు బలిదేవత అన్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇపుడు దేవత అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న అల్లోల

సారంగాపూర్: చించోలి(బీ) ఎక్స్‌రోడ్డు కూడలిలో రూ.10.50లక్షల సొంతఖర్చులతో నిర్మించిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షురాలు ఆర్య సంఘమిత్ర చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి మాట్లాడారు. పార్లమెంట్ నూతన భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక దళితసంఘాల కోరిక మేరకు బౌద్ధవిహార్ అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేసే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ చాట్ల లక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుడు సత్యనారాయణ, ఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ జీవన్‌రావు, దళిత సంఘాల నాయకులు రాజేశ్వర్, బీ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భైంసా గణేశ్ ఉత్సవాలకు 105 ఏళ్లు



ఏర్పాట్లు చేస్తున్న మండలి నిర్వాహకులు

భైంసాటౌన్: పట్టణంలో గణేశ్ ఉత్సవాలు ప్రారంభమై 105 ఏళ్లు అవుతోంది. భైంసా ప్రాంతం అప్పట్లో మహారాష్ట్రలోని నాందేడ్‌లో భాగంగా ఉండేది. పట్టణంలో మొదటిసారిగా గోపాలకృష్ణ మందిర్‌లో వినాయక విగ్రహం నెలకొల్పి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలకు ఆద్యుడు బాల గంగాధర్‌తిలక్ 1905లోనే భైంసాకు వచ్చి సార్వజనిక్ గణేశ్ మండలి వ్యవస్థాపకుడు నారాయణ్‌వాఘ్‌తో కలిసి సమావేశమయ్యారు. ఆయన స్ఫూర్తితో 1919లోనే బ్రాహ్మణగల్లిలోని గోపాలకృష్ణ మందిర్‌లో వినాయక ఉత్సవాలు ప్రారంభించారు. ఏటా ముందుగా ఇక్కడ పూజలు నిర్వహించాకే నిమజ్జనోత్సవం ప్రారంభమవుతుంది. 1921 నుంచి హాతి గణేశ్ మండలి ఆధ్వర్యంలో 102 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఏనుగు వాహనంపై విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనానికి తరలిస్తారు. పట్టణంలో నిర్వహించే నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో వస్తారు. కాగా, సోమవారం నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండగా ఇప్పటికే ఆయా కాలనీల్లో గణేశ్ మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు సందీప్ కులకర్ణి మాట్లాడుతూ.. 1919 నుంచి బ్రాహ్మణగల్లిలోని గోపాలకృష్ణ మందిర్‌లో మండలి వ్యవస్థాపకుడు నారాయణ్‌వాఘ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించగా అప్పటినుంచి ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండేళ్లకోసారి నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు పేర్కొన్నారు. హాతి గణేశ్ మండలి నిర్వాహకుడు గోవింద్ మాట్లాడుతూ.. 1921 నుంచి ఇక్కడ గణేశ్ ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నట్లు తెలిపారు. పట్టణ సీఐ శ్రీను మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు పోలీస్‌శాఖ అనుమతి తీసుకుని శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. పట్టణంలో దాదాపు 130 మండపాలుండగా, ప్రతీ మండపం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

క్రికెట్ ఆడిన రైతులు



బ్యాట్ పట్టుకున్న రైతులు

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాంలో ఆదివారం రైతులు క్రికెట్ ఆడుతూ ఆనందంగా గడిపారు. సర్పంచ్ దెగ్లూర్ రాజు ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. సుమారు 30 మంది రైతులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. మాజీ సర్పంచ్ రాము, నాయకులు నాగురావుపటేల్, నాగేశ్, పాండు, మారుతిపటేల్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కడెం: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చిన్నబెల్లాల్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పంచితి శ్రీనివాస్ శనివారం రాత్రి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని వస్తున్నాడు. చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరి వంతెన వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీనివాస్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు తేలింది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామన్నారు. అంత్యక్రియలకు వెళ్లి మద్యం తాగానని, తనను విడిపెట్టాలని ప్రాధేయపడ్డాడు. పోలీసులు వినకుండా అతడి వివరాలు తెలుసుకుని విడిచి పెట్టారు. శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పురుగు మందు డబ్బాతో వెళ్లి పోలీసులను అడ్డగించాడు. పురుగు మందు తాగేందుకు యత్నించగా వారు అడ్డుకున్నారు. కుటుంబీకులు శ్రీనివాస్‌ను ఖానాపూర్ ఆసుపత్రికి తరలించారు.

కర్ర గణేష్‌ను కొలుద్దాం



అలంకరణకు ముందు భోసి కర్ర గణేషుడు

- సరిహద్దులో పర్యావరణహితం
- 1948–50 నుంచి కర్ర విగ్రహాలే..
- ఊరంతా ఒకటే ప్రతిమకు పూజ
- మన ఊళ్లు, మరాఠీ పల్లెల్లో ఆనవాయితీ



మహారాష్ట్రలోని పాలజ్ కర్ర వినాయకుడు



మహారాష్ట్రలోని చిక్లీలో కర్ర గణేషుడు(ఫైల్)



భైంసా మాటేగాంలో కొరడి గణేష్ (ఫైల్)

నిర్మల్: గణేష్ ఉత్సవాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విశేషం ఉంటుంది. అందులో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి మరింత ప్రత్యేకత ఉంది. ఇక్కడ నవరాత్రుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులు లేకుండా, కనీసం మట్టితోనూ సంబంధం లేకుండా కర్ర వినాయకులు కొలువుదీరుతారు. ఇలా నిన్న మొన్నటి నుంచి కాదు..ఏడెనిమిది దశాబ్దాలుగా అవే వినాయక ప్రతిమలు కొలువుదీరడం విశేషం. నిర్మల్–మహారాష్ట్ర సరిహద్దులోని కర్ర గణేషుడి కథేందో తెలుసుకుందాం.

అలా మొదలై..

స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ప్రజలను ఏకతాటి పైకి తెచ్చేందుకు మహారాష్ట్రలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఆ మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో స్వాతంత్ర్యానికి పూర్వమే కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలడంతోపాటు కరువు కాటకాలు ఏర్పడ్డాయి. ప్రజలకు తాగడానికి కూడా నీరు దొరక ని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి సందర్భంలో గణేష్ నవరాత్రులు వచ్చాయి. అప్పుడు అక్కడి ప్రజలు నిమజ్జనం చేసే పరిస్థితులు లేనందున నీటితో అవసరం లేకుండా ఉండేలా కర్రతో గణపతిని చేయించాలని నిశ్చయించారు. ముందుగా తెలంగాణ సరిహద్దు పక్కనే మహారాష్ట్రలోని భోకర్ తాలూకా లోని పాలజ్ అనే గ్రామస్తులు 1948లో నిర్మల్‌లో కొయ్యబొమ్మలు చేసే నకాశీ కళాకారుడైన గుండాజీవర్మను కలిశారు. ఆయన నిష్ఠతో ఒకే కర్రతో, సహజసిద్ధమైన రంగులతో అందంగా గణపతిని తయారు చేసి ఇచ్చారు. ఆ ఊరంతటికీ ఆ కర్ర గణపతినే ప్రతిష్ఠించడంతో కొంతకాలానికే కరువుకాటకాలు, వ్యాధులు దూరమయ్యాయి. అలా..కర్ర గణపతి రాకతోనే తమ ఊరు మారిందని నమ్ముతూ దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా అదే కర్ర వినాయకుడిని ప్రతీ ఏడాది ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. నవరాత్రులు ముగియగానే కాసిన్ని నీళ్ల చల్లి, మళ్లీ బీరువాలో భద్రపరుస్తున్నారు.

మన ఊళ్లు..మరాఠీ పల్లెల్లో..

కర్ర గణపయ్య కేవలం పాలజ్‌కే పరిమితం కాలేదు. సరిహద్దులోని పలు తెలంగాణ పల్లెలు, మరాఠీ ఊళ్లల్లోనూ అదే ఆనవాయితీ ఏర్పడింది. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకాలోని చిక్లీ, నిర్మల్ జిల్లాలోని తానూరు మండలం భోసి, కుభీర్ మండలంలోని కుభీర్, పార్డీ, భైంసా మండలం మాటేగాంలలో దశాబ్దాలుగా కర్ర గణేషులే కొలువుదీరుతున్నాయి. ఆరేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోని విశ్వకర్మ సంఘంలోనూ కర్ర గణపతికి పూజలు చేస్తున్నారు.

ఎలా వెళ్లాలంటే..

దేశంలో ఎక్కడా లేనివిధంగా కర్ర గణేషులను ప్రతిష్ఠించి పూజించడం ఇక్కడే ఉంది. పర్యావరణ హితుడిగానే కాకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే సత్యదేవుడిగానూ ఈ కర్ర గణేషులు నిలుస్తున్నాయి. ఈ కారణంగా వినాయక నవరాత్రుల్లో వేలాది భక్తులు ఈసరిహద్దు గ్రామాలకు తరలివస్తున్నారు. ఒక్క పాలజ్‌లోనే నవరాత్రుల్లో రోజుకు కనీసం పదివేల మంది దర్శించుకోవడం గమనార్హం.

- హైదరాబాద్ నుంచి పాలజ్ మొత్తం 286కి.మీ దూరం ఉంటుంది. కామారెడ్డి, డిచ్‌పల్లి, నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకోవాలి. అక్కడి నుంచి 23 కి.మీ దూరంలో పాలజ్ ఉంటుంది. భైంసా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉటాయి.
- తానూరు మండలంలోని భోసిలో వరసిద్ధి వినాయకుడిగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడి కర్ర గణపతిని దర్శించుకోవాలంటే భైంసా నుంచి 11 కి.మీ వెళ్లాలి. మాంజ్రి, భోసి ఎక్స్‌రోడ్డు గ్రామానికి చేరుకోవచ్చు. భైంసా–భోకర్ వెళ్లే ప్రధాన రహదారిలో భోసి ఎక్స్‌రోడ్డు వస్తుంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది.
- మహారాష్ట్రలోని చిక్లీ కర్ర గణేష్‌ను దర్శించుకోవాలంటే భైంసా నుంచి దాదాపు 25 కి.మీ ఉంటుంది. మహాగాం, పార్డి(బి), మర్లగొండల మీదుగా చిక్లీ చేరుకోవచ్చు. భైంసా–షివిని బస్సు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- భైంసా నుంచి నిర్మల్ రహదారిలో కేవలం 5 కి.మీ దూరంలో మాటేగాం కొరడి గణపతిని ఉంటుంది.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: మామడ మండలం దిమ్మదుర్తిలో శుక్రవారం రాత్రి జరిగిన అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం ఈ ఘటన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గ్రామానికి చెందిన రవితేజ పుట్టినరోజు సందర్భంగా బస్టాండ్ వద్దకు వెళ్లి కేక్ కట్ చేసిన అనంతరం ఆరుగురు మందు పార్టీ చేసుకున్నారు. రాజేష్‌గౌడ్, నితీశ్, దిలీప్, సంపంగి శ్రీధర్, మరో బాలుడితో కలిసి అనిల్ కుమార్ మద్యం తాగారు. ఒరేయ్..నువ్వు అంబేద్కర్ విగ్రహం పగులగొడితే నీకు కాటన్ బీర్లు తెప్పిస్తామని అనిల్‌కుమార్‌ను రెచ్చగొట్టారు. దీంతో గద్దె పైకి ఎక్కి అంబేద్కర్ విగ్రహం కుడిచేయిని తన రెండు చేతులతో విరగొట్టాడు. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో నిందితులను త్వరగా పట్టుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సోన్ సీఐ నవీన్ కుమార్, మామడ ఇన్‌చార్జి ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్కాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణుల సహాయంతో కేసు దర్యాప్తు చేపట్టారు. 24 గంటల్లో కేసును ఛేదించారు. వారిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సోన్ సీఐ, మామడ ఇన్‌చార్జి ఎస్సైని ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

‘ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నం’

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు కేంద్రం యత్నిస్తోందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్ సంస్థానం విలీనం తప్ప దేశంలోని ఇతర సంస్థానాల విలీనాల గురించి బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నైజాంకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులు కాదని, ఆర్య సమాజం పోరాడిందని చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యం.అడివయ్య, బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

రాజా బహదూర్ సేవలు మరువలేనివి



విగ్రహావిష్కరణలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్వీఆర్ఆర్ సొసైటీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నిజాం ప్రభుత్వంలో కొత్వాల్‌గా విధులు నిర్వహించిన రాజా బహదూర్ వెంకట్‌రామ్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివి రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ ఎక్స్‌రోడ్ వద్ద ఆర్వీఆర్ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజాబహదూర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ సమాజ వికాసానికి మూలం స్త్రీలను విద్యాధికులుగా చేయడమేనని గాఢంగా విశ్వసించి, వారి కోసం పలు విద్యాలయాలు, హాస్టళ్లు స్థాపించారన్నారు. నిర్మల్ ఆర్వీఆర్ఆర్ సొసైటీ అధ్యక్షుడు అల్లోల మురళీధర్ రెడ్డి, సభ్యులు ఈ చౌరస్తాను ఆర్వీఆర్ఆర్ చౌరస్తాగా నామకరణం చేయాలని మంత్రికి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ తండాకు చెందిన జాదవ్ క్రిష్ణ(26) ఆదివారం విద్యుత్ షాక్‌తో చేపల వేటకు వెళ్లి హైలెవెల్ కాలువలో పడి మృతిచెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. క్రిష్ణ తన సహచరులైన రాథోడ్ సంతోష్, శ్రీనివాస్, బలిరాంతో కలిసి విద్యుత్ తీగల సహాయంతో చేపలు పట్టడానికి వెళ్లాడు. త్రీఫేజ్ విద్యుత్ వైర్లలో ఒక వైర్‌కు కరెంట్ సరఫరా చేసి కాలువలో కర్ర సాయంతో నీటిలో ముంచాడు. చేపలు తేలగా, నీటిలో కరెంట్ తీగలు ఉండటం గమనించక క్రిష్ణ దిగి మృతిచెందాడు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

ఖానాపూర్: తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్ కాలనీలోని ఓ నివాసంలో గల మొదటి అంతస్తులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కారం రాజ్‌కుమార్ కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అతడి భార్య శనివారం సాయంత్రం ఊరికి వెళ్లింది. రాజ్‌కుమార్ విధుల్లో భాగంగా స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉన్నాడు. గమనించిన దొంగలు రాత్రివేళ తాళం పగులగొట్టారు. ఇంట్లో చొరబడి 5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సమీపంలోని సాయిబాబా ఉంటున్న అద్దె ఇంటి తాళాన్ని పగులగొట్టి చొరబడ్డారు. బంగారం, నగదు దొరకలేదు. చిన్నపిల్లలు డబ్బులు పొదుపు చేసుకునే గల్లగురిగి పగులగొట్టి చిల్లరను ఎత్తుకెళ్లారు. ఆదివారం సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం అక్కడికి చేరుకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి విద్యార్థి మృతి

నిర్మల్‌టౌన్: చెరువులో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై జ్యోతి కథనం ప్రకారం.. కడెం మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన యట నరేందర్ (21), నిర్మల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ చెరువులో స్థానికులకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అతడి వివరాల కోసం అన్ని పోలీస్ స్టేషన్లను సంప్రదించారు. పాత మద్దిపడగ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్యోతి తెలిపారు.